సాక్షి జగిత్యాల

బుధవారం। 23। ఆగస్టు। 2023

థాంక్యూ సార్..

జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతోపాటు కోరుట్ల బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సంజయ్ మంగళవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట ఎమ్మెల్సీ ఎల్.రమణ ఉన్నారు.





న్యూస్‌రీల్

బీసీ రిజర్వేషన్లు పెంచాలి



ముదిరాజ్‌లతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్‌/రాయికల్: బీసీ రిజర్వేషన్లను 25శాతం నుంచి 40శాతానికి పెంచాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. రావిచెరువు మత్తడి పెంపుతోపాటు ముదిరాజ్‌లను బీసీ–ఏ జాబితాలో చేర్చాలని కోరుతూ రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు మంగళవారం జిల్లా కేంద్రంలో జీవన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంతోపాటు రాయికల్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. నాయకులు రవీందర్‌రావు, మ్యాకల రమేశ్, సుదీర్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, బాపురపు నర్సయ్య, మున్ను, రాకేశ్ పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరించండి



నిరసన తెలుపుతున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): ముత్యంపేట చక్కెర పరిశ్రమ పునరుద్ధరణలో బీజేపీ, బీఆర్‌ఎస్ పాలకులు విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభించాలనే డిమాండ్‌తో ధర్మారం నుంచి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వరకు మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని గత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాటతప్పారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయంలో అన్నివర్గాలకు న్యాయం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పౌర సరఫరాల అధికారిగా వెంకటేశ్వర్‌రావు

జగిత్యాలరూరల్: జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా వెంకటేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన చందన్‌కుమార్ వరంగల్‌కు బదిలీపై వెళ్లారు. నిజామాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్‌రావును జగిత్యాల డీఎస్‌వోగా నియమించారు.

'రెండో ఏఎన్‌ఎంలు ఏం పాపం చేశారు?'



బతుకమ్మ ఆడుతున్న రెండో ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: తల్లీబిడ్డలు, అన్నివర్గాల ఆరోగ్య సంరక్షులుగా సేవలు అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలపై ప్రభుత్వం వివక్ష చూపడం బాధాకరమని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం సమ్మెలో భాగంగా ఏడోరోజు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. మాధురి మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంల సర్వీసులను క్రమబద్ధీకరించాలన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు గూడూరి జయప్రద, మమత, పద్మ, స్వరూపరాణి, సుమలత, ఎలిజబెత్, రాజమణి, మధులత, ఊర్మిళ, కోమల, సునీత తదితరులు పాల్గొన్నారు.

రామకిష్టయ్యకు పురస్కారం

ధర్మపురి: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సంగనభట్ల చిన్నరామకిష్టయ్య బాల సాహిత్యంలో కీర్తి పురస్కారం ఇటీవల అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ప్రకటించింది. ఆయన 23ఏళ్లుగా బాల సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. ఇప్పటివరకు 800కుపైగా పిల్లలకథలు, రచనలు చేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

'దోస్త్' ప్రత్యేక ప్రవేశాలు

జగిత్యాల: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు మరోవిడత ప్రవేశాల షెడ్యూల్ విడుదలైందని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ మంగళవారం తెలిపారు. ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు, 5వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఉంటాయన్నారు. సెప్టెంబర్ 15న సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. ఇప్పటివరకు సీటురాని విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99120 99901, 99510 43660 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పొలానికి చేరని నీరు



తిప్పన్నపేట వద్ద కాలువలో ఇసుక మేటలు



తిమ్మాపూర్ వద్ద ధ్వంసమైన సిమెంట్ లైనింగ్



నర్సింగాపూర్ వద్ద అస్తవ్యస్తంగా తయారైన కాలువ

- ఎస్సారెస్పీ ద్వారా జిల్లాకు సాగునీరు
- కాకతీయ కాలువకు చాలాచోట్ల గండ్లు
- ధ్వంసమైన పిల్లకాలువల సిమెంట్ లైనింగ్
- వృథాగా పోతున్న సాగునీరు
- చివరి ఆయకట్టుకు అందని వైనం

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా జిల్లాకు సాగునీరు చేరుతోంది. కానీ, ఇటీవల కురిసిన వర్షాలతో కాలువలకు గండ్లు పడి, లైనింగ్ ధ్వంసమై, డిస్ట్రిబ్యూటరీలు అధ్వానంగా తయారై సాగునీరు వృథాగా పోతోంది.

జిల్లాలో 91 కి.మీ. విస్తరణ..

→ ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం నుంచి పెగడపల్లి మండలం వరకు సుమారు 91 కి.మీ. మేర పొడవున విస్తరించి ఉంది.

→ 25 కి.మీ. వద్ద నీటి పారకం ప్రారంభమై 116 కి.మీ. వద్ద ముగుస్తోంది.

→ డీ – 21 నుంచి డీ–83ఏ వరకు మొత్తం 62 డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉన్నాయి.

→ ఒక్కోదానికి ఆయకట్టు ఏరియాను బట్టి కాలువకు ఎడమవైపు 25, కుడివైపు మరో 25 మైనర్ కాలువలు ఉన్నాయి.

→ వీటిద్వారా పంట పొలాలకు సాగునీటి పారకం ఉంటుంది.

→ ఇలా జిల్లావ్యాప్తంగా 1.68 లక్షల ఎకరాలకు ఎస్సారెస్పీ కాయతీయ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందుతుంది.

→ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక చెరువులు, కుంటలు నింపేందుకు తూములు నిర్మించారు.

→ తద్వారా జిల్లాలో మరో లక్ష ఎకరాల వరకు సాగులోకి వచ్చాయి.

నీళ్లు అందడం లేదు



ఎస్సారెస్పీ నుంచి సాగునీరు వస్తున్నది. కానీ, పంట పొలాలకు అందడం లేదు. బావులు తోడి వాటి ఆధారంగా పంటలు పండిస్తున్నం. డిస్ట్రిబ్యూటరీ కాలువల లైనింగ్ పోయింది. తూములు మూసుకు పోయినయి.

– వేముల కరుణాకర్‌రెడ్డి, ధర్మపురి

నివేదించాం



కాలువల మరమ్మతు కోసం ప్రభుత్వానికి ఇటీవల నివేదించాం. సాగునీటి వృథాను అరికట్టి, చివరి ఆయకట్టుకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉపాధిహామీ ద్వారా పిచ్చిమొక్కలు, రాళ్లు తొలగిస్తున్నాం.

– రమేశ్, డిప్యూటీ సీఈ, ఇరిగేషన్, జగిత్యాల

అధ్వానంగా కాలువలు..

ఎస్సారెస్పీ ద్వారా జిల్లాకు సాగునీరు వస్తున్నా.. కాలువలు అధ్వాన్నం కావడంతో పొలాలకు చేరడంలేదు. ఏదోఓసారి ప్రధాన కాలువకు మరమ్మతు చేస్తున్నా.. డిస్ట్రిబ్యూటరీలు, పిల్లకాలువలను పట్టించుకోవడంలేదు. దీంతో వాటిలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. సిమెంట్ లైనింగ్ ఊడిపోతోంది. తూములు ధ్వంసమవుతున్నాయి. డ్రాప్‌లు పగిలిపోతున్నాయి. సాగునీరు వృథాగా పోతోంది. కొన్నిచోట్ల కాలువల ఆనవాళ్లు కూడా కనిపించడంలేదు.

చివరి ఆయకట్టుకు అందని నీళ్లు..

→ వెల్గటూర్, పెగడపల్లి, ధర్మపురి తదితర చివరి మండలాల ఆయకట్టుకు సాగు నీరు అందడం కష్టంగా మారింది.

→ ప్రపంచ బ్యాంకు నిధులతో 2008లో డిస్ట్రిబ్యూటరీ కాలువలకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేశారు. ఆ తర్వాత అతీగతి లేదు.

→ పిల్లకాలువలకు సాగునీరు వచ్చే మార్గం లేక, రైతులు డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో రాళ్లు, మట్టి వంటివి అడ్డు వేసినీళ్లు తరలించుకుపోవడం పరిపాటిగా మారింది.

→ అవసరమైతే గండ్లు కూడా పెడుతున్నారు.

→ చాలాచోట్ల నీటిపారకం లేని పిల్లకాలువలను కొందరు రైతులు దున్నుతూ సమీపంలోని తమ భూముల్లో కలుపుకుంటున్నారు.

→ ఉపాధిహామీ కూలీలతో కొన్నిచోట్ల పిల్లకాలువలకు మరమ్మతు చేస్తున్నా.. సాగునీరు విడుదల చేసే సమయానికి పిచ్చిమొక్కలు మళ్లీ ఏపుగా పెరిగి పారకానికి ఆటంకం ఏర్పడుతోంది.

→ రాయికల్ మండలంలోని చివరి గ్రామం జగన్నాథపూర్, జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి, బుగ్గారం మండలం సిరికొండ, పెగడపల్లి మండలం వెంగళాయిపేట, లింగాపూర్, దోమలకుంట, ఎస్సారెస్పీ డిస్ట్రిబ్యూటరీ– 53 రోళ్లవాగు కింద ఉన్న ధర్మపురి మండలం చివరి గ్రామాలకు సాగునీరు అందడం కష్టంగా మారింది.

అధికారుల పర్యవేక్షణ శూన్యం..

గతంలో పిల్లకాలువల నుంచి ఎస్సారెస్పీ వరకూ నీటిసంఘాల పాలకవర్గం, చైర్మన్లు ఉండేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కాలువల నిర్వహణ అధ్వానంగా మారింది. నీటిని సక్రమంగా అందించేందుకు అధికారులు, లష్కర్ల వంటి క్షేత్రస్థాయి సిబ్బంది తరచూ పర్యవేక్షించేవారు. ప్రస్తుతం సిబ్బంది కొరత వేధిస్తోంది.

- యువర్ అటెన్షన్ ప్లీజ్..

'పెద్దపల్లి బైపాస్'కు లైన్ క్లియర్

- చీకురాయి–పెద్దబొంకూరు మధ్య కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణానికి నిర్ణయం
- తొలుత ఎలక్ట్రిక్ లైన్‌కు టెండర్లు పిలిచిన దక్షిణ మధ్య రైల్వే
- భవిష్యత్తులో ముంబై, సికింద్రాబాద్ మధ్య రైళ్ల సంఖ్య పెరిగే అవకాశం
- ఉమ్మడి కరీంనగర్‌వాసులకు మేలు



చీకురాయి వద్ద రైల్వే ట్రాక్‌లు కలిసే ప్రాంతం

ఉమ్మడి జిల్లా ప్రజలకు ఉపయుక్తం

చీకురాయి వద్ద రైల్వేస్టేషన్ నిర్మించతలపెట్టడం అభినందనీయం. రెండు మార్గాలు కలిసేచోట స్టేషన్ నిర్మించడం వల్ల మా ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇది ఒక్క పెద్దపల్లి ప్రజలకే కాకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– మేకల శ్రీనివాస్, చీకురాయి

సాక్షి ప్రతినిధి,కరీంనగర్: ఎన్నో దశాబ్దాలుగా కరీంనగర్ నుంచి హైదరాబాద్, ముంబై వంటి నగరాలకు రైలులో వెళ్లాలన్న పాత కరీంనగర్ వాసుల కల త్వరలో సాకారం కానుంది. ఇందుకోసం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్–కాజీపేట–బల్లార్షా సెక్షన్‌ను పెద్దపల్లి–కరీంనగర్–ముంబై సెక్షన్ లైన్‌తో కలపనుంది. ఇటీవల పెద్దపల్లి–కరీంనగర్ మార్గాన్ని డబ్లింగ్ లైన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ముందుకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే తాజాగా.. కాజీపేట–బల్లార్షా, కరీంనగర్–పెద్దపల్లి లైన్లను కలపడం ద్వారా ఈ సెక్షన్‌లోని రైల్వే ప్రయాణంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టబోతోంది.

భూమి ఇచ్చేందుకు రైతుల అంగీకారం

పెద్దపల్లి జిల్లాలోని చీకురాయి–పెద్దబొంకూరు గ్రామాల మధ్య పెద్దపల్లి బైపాస్ పేరుతో కొత్త రైల్వేస్టేషన్ నిర్మించతలపెట్టారు. ఇందుకోసం ఇటీవల రెండు గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. దాదాపు 20 ఎకరాల వరకు భూమిని ఇచ్చేందుకు రైతులు అంగీకరించారు. వారికి పరిహారం ఇచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. రైల్వేస్టేషన్ నిర్మాణంలో భాగంగా ముందుగా ఎలక్ట్రిక్ లైన్ నిర్మించేందుకు ఇటీవల టెండర్లు పిలిచింది. త్వరలోనే స్టేషన్ నిర్మాణం కోసం టెండర్లు పిలవనుంది. చీకురాయి–పెద్దబొంకూరుల మధ్య పాయింట్‌ను వ్యూహాత్మకంగా ఎంపిక చేశారు. ఇది కాజీపేట–బల్లార్షా లైన్‌తో కరీంనగర్–పెద్దపల్లి లైన్ కలిసే ప్రాంతం. ఇంతకాలం ఒక రైలు కరీంనగర్ మీదుగా కాజీపేట/సికింద్రాబాద్ వైపు వెళ్లాలంటే ముందు పెద్దపల్లి జంక్షన్ చేరాలి. అక్కడ బోగీల ముందు ఉన్న ఇంజిన్ విడిపించుకొని, ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చి కాజీపేట వైపు ఉన్న బోగీలను లింక్ చేసుకొని వెళ్లాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు పెద్దపల్లి బైపాస్ రైల్వేస్టేషన్ పూర్తయితే కాజీపేట వైపు వెళ్లే రైళ్లన్నీ కొత్త స్టేషన్ మీదుగా ఎలాంటి ఇంజిన్ మార్పులు అవసరం లేకుండా సాఫీగా సాగిపోతాయి. జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్‌వాసులకు కాజీపేట/వరంగల్/సికింద్రాబాద్ వైపు ప్రయాణం మరింత సులువు కానుంది.

గణనీయంగా పెరిగిన ఫ్రీక్వెన్సీ

కరోనాకు ముందు ఇది కేవలం సింగిల్ లైన్ మార్గం. నిజామాబాద్ వరకు కనెక్టివిటీ ఉండటం, ఈ మార్గాన్ని వందే భారత్ వంటి రైళ్లు సైతం నడిచేలా ఇటీవల 100 కి.మీ. వేగం తట్టుకునేలా ట్రాక్ సామర్థ్యం పెంచారు. గతంలో ఖాజీపేట–బల్లార్షా సెక్షన్‌లోని రైళ్లు సికింద్రాబాద్ మీదుగా మహారాష్ట్ర వెళ్లేవి. దీనివల్ల చాలా ఇంధనం, సమయం వృథా అయ్యేవి. ఈ మార్గం పూర్తి కావడంతో కరోనా కాలంలో పెద్దపల్లి–నిజామాబాద్ రూట్‌కు డిమాండ్ బాగా పెరిగింది. ప్రతీరోజు గ్రానైట్, బొగ్గు, బాయిల్డ్ రైస్, వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసే రైళ్ల ఫ్రీక్వెన్సీ గతంలో ఎన్నడూ లేనంతగా గణనీయంగా పెరిగింది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో సరుకు రవాణా రైళ్ల ద్వారా అత్యధికంగా ఆదాయం తీసుకువచ్చే రైల్వే మార్గాల్లో పెద్దపల్లి–నిజామాబాద్ ఒకటిగా ఆవిర్భవించింది.

చెప్పుకోదగ్గ రైళ్లేవీ లేవు

కానీ, ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లు మాత్రం చెప్పుకోదగ్గవి ఏమీలేవు. ఢిల్లీ, కోల్‌కతా, విశాఖపట్టణం, వారణాసి, బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం నగరాలకు రైళ్లు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మార్గంలో కేవలం రెండు పుష్‌పుల్ (డెమూ, మెమూ) ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాజీపేట నుంచి దాదర్ ముంబై వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్, తిరుపతి నుంచి కరీంనగర్ బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ మార్గంలో కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ లాంటి ఎక్కువ జనాభా కలిగిన పట్టణాలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో డబ్లింగ్ పూర్తయితే ఇటు ముంబై వైపు, అటు సికింద్రాబాద్ వైపు రైళ్ల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. మరోవైపు అటల్ మిషన్ ఫర్ రిజునవేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంఆర్‌యూటీ) పథకం కింద ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌కు రూ.26.6 కోట్లు, రామగుండంకు రూ.26.50 కోట్లు, పెద్దపల్లికి రూ.20 కోట్లు మంజూరయ్యాయి. అయితే, ఈ పనులను రెండు దఫాల్లో చేపట్టనున్న కేంద్రం.. తొలిదశలో కరీంనగర్, రామగుండం స్టేషన్లను అభివృద్ధి చేసి, మరికొన్ని నెలల్లోనే పెద్దపల్లిలోనూ పనులు ప్రారంభించనుంది.

పార్టీయే బలం.. ప్రజలే బలగం

పార్టీ మా బలం.. నియోజకవర్గ ప్రజలే బలగం అంటున్నారు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు.. వచ్చే ఎన్నికల్లో పోటీచేసే బీఆర్‌ఎస్ అభ్యర్థులు. సీఎం కేసీఆర్ మమ్మల్ని అభ్యర్థులుగా కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ఇంతవరకు ఎంతో అభివృద్ధి చేశామని.. మరిన్ని పనులు చేసేందుకు ప్రజలు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ కార్యకర్తలు.. ప్రజల సహకారంతో విజయబావుట ఎగురవేస్తామన్నారు. అందరితో కలిసికట్టుగా పనిచేస్తూ తిరుగులేని గులాబీ సైన్యంగా ముందుకు సాగుతామని.. వచ్చేది మనదే సర్'కారు' అని పేర్కొన్నారు. ఇంకా వారేమన్నారో వారి మాటల్లోనే...

ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తా



సిరిసిల్ల: సీఎం కేసీఆర్ నన్ను సిరిసిల్ల అభ్యర్థిగా ప్రకటించినందుకు ధన్యవాదాలు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తాం. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలుస్తా. 2009 నుంచి సిరిసిల్ల ప్రజలు నన్ను నాలుగు సార్లు గెలిపించారు. వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. నియోజకవర్గ ప్రజల దీవెనలతో భారీ మెజార్టీతో గెలుస్తా.

– కె.తారక రామారావు,

అభివృద్ధే ధ్యేయం



వేములవాడ: రాజన్న గుడి, వేములవాడ మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు పనిచేసిన రమేశ్‌బాబు నాయకత్వంలో భారీ మెజార్టీతో గెలుస్తాను. బీఆర్‌ఎస్ పార్టీలో వర్గపోరు లేదు. మేమంతా ఒకే కుటుంబం.


– చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేలకోట్లతో అభివృద్ధి



కరీంనగర్: కరీంనగర్‌ను పదేళ్లల్లో వేలకోట్లతో అభివృద్ధి చేశాను. సీఎం కేసీఆర్‌కు కరీంనగర్‌పై ప్రత్యేక అభిమానంతో నిధులు కేటాయిస్తున్నారు. రూ.180 కోట్లతో తీగలవంతెన, రూ.410 కోట్లతో రివర్‌ఫ్రంట్ పనులు సాగుతున్నాయి. ఐటీటవర్, మెడికల్ కాలేజీ తదితరాలు పూర్తయ్యాయి. మేనిఫెస్టోలో లేని పనులు చేసి చూపించా. నాలుగోసారి విజయ బావుట ఎగురవేస్తా.. –గంగుల కమలాకర్, మంత్రి

ప్రజారుణం తీర్చుకుంటా



మానకొండూరు: మూడోసారి భారీ మెజార్టీతో గెలిచి ప్రజలరుణం తీర్చుకుంటా. సీఎం కేసీఆర్ నాపై నమ్మకంతో రెండుసార్లు మానకొండూరు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చారు. అందరి సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేశాను. టిక్కెట్ ఇచ్చిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. – రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే

కేసీఆరే దైవం



చొప్పదండి: కేసీఆర్ దైవసమానులు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. కార్యకర్తలే నా బలం, బలగం. గత ఎన్నికల్లో 42 వేల మెజారిటీతో గెలిపించారు. ఐదేళ్లలో నియోజకవర్గాన్ని మరో కోనసీమగా చేశా..రూ. 150 కోట్లతో కొండగట్టు అభివృద్ధి జరుగుతోంది.

– సుంకె రవిశంకర్, ఎమ్మెల్యే

వెయ్యి కోట్లతో అభివృద్ధి



హుజూరాబాద్: హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గడిచిన రెండేళ్లలో నియోజకవర్గంలో తట్టెడు మట్టి కూడా పోయలేదు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఊహించనిస్థాయిలో అభివృద్ధి జరిగింది. ఈసారి ఇక్కడ ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే. మరోసారి కేసీఆర్ సీఎం కాబోతున్నారు. నన్ను గెలిపిస్తే రూ.వెయ్యికోట్లతో అభివృద్ధి పనులు చేస్తా. – పాడికౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ

పెద్దపల్లికి గుర్తింపు తెస్తా



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలుపుతా. ఇప్పటికే స్వచ్ఛసర్వేక్షన్, హరితహారంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేకగుర్తింపు పొందింది. పెద్దపల్లి– కూనారం రోడ్డులో రైల్వేవంతెన పనులు పురోగతిలో ఉన్నాయి.

– దాసరి మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే

కేసీఆర్ నాయకత్వంలో..



గొల్లపల్లి: కేసీఆర్ నాయకత్వంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. ప్రజలకు ఎంతో సేవచేశాను. ఇప్పుడు మరో అవకాశం ఇచ్చారు. ఈసారి కూడా ప్రజల ఆశీర్వాదాన్ని కోరుతున్నా. ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి అన్నిరకాలుగా అండగా ఉంటా.

– కొప్పుల ఈశ్వర్, మంత్రి

అభివృద్ధితో ముందుకు..



జగిత్యాల: అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తా. లిప్పటికే జగిత్యాలలో మెడికల్ కాలేజీ, మున్సిపాలిటీ సుందరీకరణ, రోడ్డు వెడల్పు పనులకు కృషి చేశాను. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటాను.

– సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

నాన్న స్ఫూర్తి..



కోరుట్ల: నాలుగుసార్లు ఎమ్మెల్యేగా కోరుట్ల అభివృద్ధికి కృషిచేసిన నాన్న విద్యాసాగర్‌రావు స్ఫూర్తి. యువకుడిగా, వైద్యుడిగా నియోజకవర్గ అభివృద్ధిపై ప్రణాళికతో ముందుకెళ్తా. ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తా. నాన్న చేసిన అభివృద్ధి పనులు నా గెలుపునకు దోహదపడతాయి. – డాక్టర్ సంజయ్

క్లుప్తంగా

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు


సబ్‌స్టేషన్‌లో చెలరేగుతున్న మంటలు

జగిత్యాలరూరల్:కల్లెడ గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వీటి ధాటికి రెండు సీటీలు పేలిపోయాయి. ఉన్నతాధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

జగిత్యాల యువకుడికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న పవన్‌కుమార్

జగిత్యాలటౌన్: జగిత్యాలకు చెందిన వావిలాల పవన్‌కుమార్ సోషల్ వర్క్ కేటగిరీలో డాక్టరేట్ అందుకున్నాడు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ పీస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఇంటర్నేషనల్ మెంబర్‌గా సేవలందిస్తున్న పవన్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరినవారితో లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన నేతకాని కాలనీకి చెందిన సుమారు వంద మంది మంగళవారం డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపుతో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు ఎస్.దినేశ్, సింహరాజు ప్రసాద్, వేముల రాజేశ్, కుంట సుధాకర్, చిలుముల లక్ష్మణ్ తదితరులున్నారు.

కళాసేవ పురస్కారం అందజేత


రాజుకు పురస్కారం అందిస్తున్న మేయర్ సునీల్‌రావు

జగిత్యాల: జగిత్యాలకు చెందిన కళశ్రీ అధినేత గుండేటి రాజుకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ కరీంనగర్ ఫోక్స్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పురస్కారం ప్రకటించారు. మంగళవారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో అక్కడి మేయర్ సునీల్‌రావు చేతులమీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎడ్ల అశోక్, కరీంనగర్ ఫోక్స్ అధ్యక్షుడు కృపానందం తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల కుటుంబసభ్యులకు 'ఉన్నతి'

- కార్యక్రమాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం
- విద్యార్హతలను బట్టి నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- 100 రోజుల పనిదినాలు పూర్తయిన కూలీల కుటుంబాలకే అవకాశం
- ఈ ఏడాది జిల్లాలో 908 మంది ఎంపిక


శిక్షణ పొందుతున్న యువకులు

జగిత్యాలరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు ప్రభుత్వం ఆర్థికంగా చేదోడుగా ఉండేందుకు మరో అవకాశం కల్పించింది. వారి కుటుంబసభ్యుల్లో విద్యార్హతలను బట్టి నైపుణ్యాభివృద్ధికి గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నుంచి ఉన్నతి అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. కూలీల కుటుంబాల్లోని యువతకు 35 రకాల అంశాల్లో శిక్షణనిచ్చి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూతనివ్వనుంది.

జిల్లాలో 380 గ్రామాలు..

జగిత్యాల జిల్లాలోని 380 గ్రామ పంచాయతీల్లో 1.67 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 2.73 లక్షల మంది కూలీలు పని చేస్తున్నారు. వీరిలో 66,878 మంది వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నారు. ఉన్నతి పథకానికి 18 నుంచి 45 ఏళ్ల వయసున్నవారు మాత్రమే అర్హులు. దీని ఆధారంగా 908 మంది కూలీల కుటుంబసభ్యులు ఉన్నతి కార్యక్రమానికి అర్హత పొందారు. అయితే వీరిలో ఎంతమంది శిక్షణకు ఆసక్తి చూపుతారో మరోసారి సర్వే నిర్వహించి, వారికి మాత్రమే శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రధానంగా వీటిలో శిక్షణ..

కూలీల కుటుంబసభ్యులకు ప్రధానంగా ఇంగ్లిష్ వర్క్, ఎలక్ట్రీషియన్, పంబ్లింగ్, ఫిట్టర్, మేషన్, వెల్డింగ్, ల్యాండ్ సర్వే, పెయింటింగ్ అండ్ డెకోరేషన్, హెవీ, లైట్ మోటార్ డ్రైవింగ్‌తోపాటు పలు రంగాల్లో శిక్షణనిచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

ఉపాధి అవకాశాలు పొందవచ్చు



జిల్లాలో 100 రోజుల ఉపాధిహామీ పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబసభ్యులకు ఉన్నతి కార్యక్రమం ద్వారా పలు రంగాల్లో ఉచితంగా శిక్షణనిస్తాం. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

– నరేశ్, డీఆర్డీఏ పీడీ, జగిత్యాల

శాఖాపరమైన విచారణ ఏదీ?

- అటెండర్‌పైనే సస్పెన్షనా?
- హోంగార్డులు, అధికారులపై లేదా?
- ప్రశ్నిస్తున్న అంజన్న భక్తులు


కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి):కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఈ ఏడాది ఫిబ్రవరి 24న చోరీ జరిగింది. 33 కిలోల వెండి ఆభరణాలను దొంగలు అపహరించారు. ఈ సమయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆలయ అటెండర్‌ను అప్పుడు సస్పెండ్ చేశారు.

33 కిలోలు చోరీ..

దొంగతనం జరిగిన వెంటనే ఆలయ ఈవో వెంకటేశ్.. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. 15కిలోల వెండి చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపిన పోలీసులు.. నిందితులను అరెస్టు చేశారు. ఆభరణాలు రికవరీ చేశారు. అయితే, విచారణ కోసం కొండగట్టుకు వచ్చిన హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ అధికారులకు.. 33కిలోలు వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని, 16.700 కిలోలు రికవరీ అయ్యిందని కొండగట్టు ఆలయ అధికారులు వివరించారు. అయితే, ఆలయంలో ఎంత వెండి ఉంది, ఎంతచోరీకి గురైందనే విషయంలో స్పష్టత లేకుండానే 15కిలోల వెండి ఆభరణాలు ఎలా అపహరణకు గురయ్యాయని ఈవో ఎలా ఫిర్యాదు చేశారంటూ ప్రశ్నలు తలెత్తాయి. అయితే, ఆరు నెలలు కావస్తున్నా.. శాఖాపరమైన చర్యలు ఏమీ చేపట్టడం లేదు. ఈ విషయంపై ఈవో వెంకటేశ్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. మరోవైపు.. పెద్ద చోరీ జరిగితే అటెండర్‌ను సస్పెండ్ చేసిన అధికారులు.. ఆ సమయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హోంగార్డులు, అధికారులపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

రికవరీ చేశాం

ఈ ఏడాది ఫిబ్రవరిలో కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో జరిగిన చోరీ కేసులో ఎనిమిది మంది నిందితులు కాగా, వారిలో ఏడుగురిని పట్టుకున్నాం. ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు ఆభరణాలు రికవరీ చేశాం.

– కోటేశ్వర్, సీఐ, మల్యాల

శారీరక శ్రమతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ యాస్మిన్ బాషా


వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల:శారీరక శ్రమతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉమ్మడి కుటుంబంలో అమ్మమ్మలు, తాతయ్యలు, పెద్దవారు మన ప్రవర్తన, శైలిపై తగిన సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. అవి మన జీవితానికి బాటలు వేసేలా ఉంటాయని తెలిపారు. తాను కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేసేందుకు మా అమ్మానాన్నల ప్రోత్సాహమే కారణమని తెలిపారు. ప్రస్తుతం అలాంటి కుటుంబాలు లేక నైతిక విలువలు పెంపొందడం లేదని చెప్పారు. వృద్ధుల సంరక్షణ పిల్లలదేనని, బాధ్యతలు విస్మరిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు.

ఈసారి ఎన్నికల్లో హోం ఓటింగ్..

ఈసారి ఎన్నికల్లో హోం ఓటింగ్ నిర్వహిస్తామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. 40శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారు, 80ఏళ్ల పైబడిన వృద్ధుల కోసం హోం ఓటింగ్ పద్ధతి అమలు చేస్తామని అన్నారు. ఇందుకోసం ఐదు రోజుల ముందుగానే 12డీ ఫాం ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు దివాకర, లత, నరేశ్, అశోక్, రాజం పాల్గొన్నారు.

గడువులోగా అభ్యంతరాలు తెలపాలి

ఓటరు ముసాయిదా జాబితాపై నిర్దేశిత గడువులోగా అభ్యంతరాలు తెలపాలని కలెక్టర్ యాస్మిన్ బాషా కోరారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6,48,50 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 3,14,576 మందికాగా, మహిళలు 3,33,457 మంది ఉన్నారని, మిగతా వారు ట్రాన్స్‌జెండర్స్ అని వివరించారు.

మంత్రి ఈశ్వర్‌కు శుభాకాంక్షలు


మంత్రికి పూలమొక్క అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ లభించడం పట్ల జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి, పూలమొక్క అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యేలు



మంత్రి హరీశ్‌రావుతో ఎమ్మెల్యేలు సంజయ్, విద్యాసాగర్‌రావు, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్

జగిత్యాల: జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి అవకాశం ఇవ్వడంతో ఎమ్మెల్యే సంజయ్ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, హోంమంత్రి మహమూద్ అలీ, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ రమణలను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు.

కోరుట్ల ఎమ్మెల్యే, ఆయన తనయుడు..

కోరుట్ల: కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థిగా తన కుమారుడు కల్వకుంట్ల సంజయ్‌కు అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు తన కుమారుడితో కలిసి మంగళవారం హైదరాబాద్ వెళ్లి, ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉద్యమకారులకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలి

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ


మాట్లాడుతున్న సత్యనారాయణ

కథలాపూర్(వేములవాడ): తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న నేతలకు బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడం దారుణమని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ అన్నారు. మంగళవారం కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేసి, ఉద్యమించిన వేములవాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలు లోక బాపురెడ్డి, ఏనుగు మనోహర్‌రెడ్డిల్లో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలన్నారు. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబును తప్పించి, అదే సామాజిక వర్గానికి చెందినవారికి టికెట్ ఇవ్వడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గానికి చెందిన రెడ్డి లేదా బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు టికెట్ ఇవ్వకపోతే ఆ పార్టీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం


సూరమ్మ ప్రాజెక్టు వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

- సూరమ్మ ప్రాజెక్టుపై చెప్పేవన్నీ అబద్ధాలే
- రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ):కథలాపూర్ మండలం కలిగోట శివారులోని సూరమ్మ ప్రాజెక్టు నిర్మాణంపై బీఆర్ఎస్ ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ అబద్ధాలేనని, ఇలా రైతులను ఏళ్లుగా మోసం చేస్తూ వస్తోందని రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. కలిగోటలో సూరమ్మ ప్రాజెక్టు నిర్మాణ స్థలం వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మంగళవారం నిరసన తెలిపారు. 2018 సంవత్సరంలో ముందస్తు ఎన్నికల వేళ సూరమ్మ ప్రాజెక్టు కాలువ పనులకు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు భూమిపూజ చేశారని, ఇప్పటికీ తట్టెడు మట్టి పనులు చేయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందడానికి సూరమ్మ ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కపట నాటకమాడుతున్నారని విమర్శించారు. రైతులు వారి మాటలు నమ్మవద్దని కోరారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఐదేళ్లలో సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తియ్యేవని.. కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాలకు సాగునీరు అందించేవారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు పూర్తిచేసి మూడు మండలాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్, మేడిపెల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితి నాగరాజు, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, నాయకులు ఎండీ అజీమ్, కల్లెడ గంగాధర్, తొట్ల అంజయ్య, అల్లూరి దేవారెడ్డి, కట్ట శంకర్, పులి హరిప్రసాద్, మార్క రాజేశం, వెలిచాల సత్యనారాయణ, అంబటి రాధాకృష్ణ, ఆకుల సంతోష్, కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్‌లను బదిలీ చేయాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: జిల్లా ఆస్పత్రికి 317 జీవో ప్రకారం వచ్చిన స్టాఫ్ నర్స్‌లను వెంటనే బదిలీ చేయాలని టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు బోగ శశిధర్ అన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో స్టాఫ్ నర్స్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 317 జీవో ప్రకారం బదిలీపై వచ్చిన తమకు అన్యాయం జరిగిందని, వెంటనే ప్రభుత్వం బదిలీ చేసేలా చూడాలని వారు కోరుతున్నారని తెలిపారు. బదిలీ చేయాలని హైకోర్టు ఆదేశాలున్నా ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు ధర్మపురికి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి

ధర్మపురి: అంతర్జాతీయ వేదికపై పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించి, భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి స్వదేశానికి వస్తున్న క్రీడాకారిణికి నేడు ఘనస్వాగతం పలకనున్నారు. ధర్మపురికి చెందిన రంగు విరంచి స్వప్నిక ఈ నెల 16 నుంచి 21 వరకు షార్జాలో జరిగిన ఆసియా యూనివర్సిటీ కప్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 4 బంగారు పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ధర్మపురిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి వివేకానంద, పటేల్, గాంధీ కూడలిల మీదుగా శివాజీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పట్టణ ప్రజలు తెలిపారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు

జగిత్యాలజోన్: మహిళపై గొడ్డలితో దాడి చేసిన కేసులో ఓ వ్యక్తికి ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ప్రసాద్ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిల్ల మురళి కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త చనిపోవడంతో, రాజారాంపల్లికి చెందిన ఆశయ్యతో సహజీవనం చేస్తోంది. అయితే, ఆశయ్య తన పేరుమీద ఉన్న ఇల్లును ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. అదే ఇంట్లో అతని కూతురు, అల్లుడు కొప్పుల అంజయ్య(గుల్లకోట) ఉంటున్నారు. కానీ ఇంటిని సదరు మహిళ పేరిట రిజిస్ట్రేషన్ చేయడం వీరికి నచ్చలేదు. ఈ క్రమంలో ఆమె వారిని తన ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని అంటుండటంతో గొడవలు, పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అప్పటినుంచి ఆమెపై అంజయ్య, అతని భార్య పగ పెంచుకున్నారు. ఆ మహిళను చంపి, ఎలాగైనా ఇంటిని దక్కించుకోవాలని అనుకున్నారు. మార్చి 8, 2016న గొడ్డలితో దాడి చేయగా, తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనపై బాధితురాలి కూతురు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై బి.అంజయ్య దర్యాప్తు పూర్తి చేసి, నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు జి.కిరణ్‌కుమార్, డి.శ్రీధర్‌లు సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. వాటిని పరిశీలించిన అనంతరం న్యాయమూర్తి మొదటి నిందితుడైన కొప్పుల అంజయ్యకు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.1,000 జరిమానా వేయగా, రెండో నిందితురాలిగా ఉన్న అతని భార్యకు కేసు నుంచి విముక్తి కల్పిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు.

ఈజీఎస్ పనుల్లో రూ.1.48 లక్షల దుర్వినియోగం



బీర్‌పూర్‌లో విచారణ జరుపుతున్న అధికారులు

- ఈజీఎస్ ఏపీడీ శివాజీ వెల్లడి
- రికవరీ చేయాలని అధికారులకు ఆదేశం

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ ద్వారా 28 నెలల్లో చేపట్టిన పనులపై మండల కేంద్రంలో మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ పనుల్లో రూ. 1.48లక్షలు దుర్వినియోగమైనట్లు అధికారులు తేల్చారు. వాటిని రికవరీ చేయాలని ఆదేశించారు. భవిష్యత్‌లో నిధులు మళ్లీ దుర్వినియోగమైతే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈజీఎస్ ఏపీడీ శివాజీ హెచ్చరించారు. 2020 డిసెంబర్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనుల్లో రూ.1,48,300 అవినీతి జరిగినట్లు విచారణలో తేలిందని అన్నారు. గ్రామపంచాయతీల పనుల్లో రూ.63 వేలు, పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.20వేలు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ.6వేలు, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రూ.2వేలు, ఈసీ నుంచి రూ.2వేలు, ఫీల్డ్‌అసిస్టెంట్ల నుంచి రూ.2వేలు, ఇతరుల నుంచి మరో రూ.9వేలు రికవరీ చేయాలని ఆదేశించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విజిలెన్స్ అధికారి చిన్నయ్య, క్వాలిటీ కంట్రోల్ అధికారి రాజేంద్రప్రసాద్, ఏపీవో కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత సేవలో బీజేపీ నాయకులు



జగిత్యాలటౌన్: బీజేపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం స్థానిక దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

టైరు పేలి వాహనాలను ఢీకొన్న టిప్పర్

- ఇద్దరికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): టైరు పేలడంతో ఓ టిప్పర్ అవతలి రోడ్డుపై వెళ్తున్న మూడు వాహనాలను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ సమీపంలోని రాజీవ్ రహదారిపై మంగళవారం పెద్దపల్లి నుంచి కంకర లోడ్‌తో వస్తున్న టిప్పర్ టైరు పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి, రామగుండం వైపు వెళ్లే రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్, ట్రాలీఆటోతోపాటు మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీఆటో డ్రైవర్ అజాషా వాహనంలోనే ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ ఎస్సై జీవన్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై వాహనాలను ఆపేసి, అజాషాను బయటకు తీశారు. అతనితోపాటు గాయపడిన మరో వ్యక్తిని చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఎన్టీపీసీ పోలీసులతోపాటు ట్రాఫిక్ పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు.

ఏటీఎంలలో చోరీకి యత్నం

మేడిపెల్లి : మండల కేంద్రంలోని రెండు ఏటీఎంలలో దుండగులు సోమవారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. క్యాష్ బాక్స్‌లు తెరుచుకోకపోవడంతో వెళ్లిపోయారు. మంగళవారం తెల్లవారుజామున చోరీకి యత్నించినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోండి

జగిత్యాల: 2022–23 సంవత్సరానికి మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాల్లో పీజీ, వైద్య విద్యనభ్యసించాలనుకునే మైనారిటీ విద్యార్థుల నుంచి సీఎం విదేశీ విద్య పథకం ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు. www. telangana. epass. cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే నెల 21వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత రెండు సెట్ల దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని కొంతంవాడ (ప్రగతినగర్)కు చెందిన కొంతం సంతోష్(39) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి కథనం ప్రకారం.. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న సంతోష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై, మంగళవారం పెద్దపల్లి శివారులోని రైల్వే వంతెన వద్ద గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. సంతోష్ భార్య సుమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన కొంతం సాయితేజ(23) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సాయితేజ మద్యానికి బానిసయ్యాడు. ఆ మత్తులోనే మంగళవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.